హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.170	250	280
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 24.2

కొనుగోలుకు కొర్రీలు

» నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ఆంధ్రజ్యోతి విజిట్



ధాన్యం కొనుగోలు కేంద్రాల లక్ష్యం నీరుగారుతోంది. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యంతో ఎండవేడిమికి తాగునీరు, టెంట్ సౌకర్యం లేక హమాలీలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలు, గన్నీబ్యాగుల కొరతతో ఎగుమతి, దిగుమతులు ఆలస్యమవుతున్నాయి. దీంతో రోజుల తరబడి కేంద్రాల వద్దే రైతులు పడిగాపులు పడుతు న్నారు. దీనికి తోడు కాంటా వేసేందుకు హమాలీలకు, ఇతర చార్జీలు, తాలూ పేరుతో రైతులు నిలువునా దోపిడీకి గురవుతున్నారు. కొన్నిచోట్ల ఎగుమతి, దిగుమతి బాధ్యతలనూ రైతులపేనే వేస్తున్నారు. వెరసి కేంద్రాల్లో కర్షకులు దోపిడీకి గురవుతున్నారు.

• 6లో..

నాంపల్లి నుంచి కొండమల్లేపల్లికి వచ్చిన



కొండమల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని తెలిసి నాంపల్లి మండలం నుంచి 20 రోజుల కిందట ధాన్యం తీసుకొచ్చా. తేమ వచ్చి 6 రోజులు గడుస్తోంది. లారీల కొరత సాకుతో కొనుగోళ్లు చేయలేదు. ఎప్పుడు వర్షం వస్తుందోనని భయంతో టార్పాలిన్లు అద్దెకు తెచ్చి పంటను కాపాడుకుంటున్నా. డబ్బులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం.

జక్కుల వెంకటయ్య, ముష్టిపల్లి

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలైన ప్రక్రియ (ఆంధ్రజ్యోతి, నల్లగొండ) • 7లో..

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం అంతంతే!



భూ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)పై ఉమ్మడి జిల్లాలో ఆశించిన ఫలితం దక్కడంలేదు. 2020లో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పొడిగిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులోగా నిలిపివేయాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం 25శాతం రాయితీ కూడా ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఆశించిన రీతిలో దరఖాస్తులు పరిష్కారమవకపోవడంతో అనుకున్నమేర ఆదాయం రాలేదు. తాజాగా మరోసారి జూన్ 3వ తేదీ వరకు దరఖాస్తుల నమోదు, పరిష్కారానికి గడువుపెంచింది. ఈసారైనా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తుంటే, ఈ దఫాలోనైనా సర్వర్ల సమస్యలు, క్షేత్ర పరిశీలన పేరుతో దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

» ఉమ్మడి జిల్లాలో రూ.107.57కోట్లు వసూలు » భారీగా వచ్చిన దరఖాస్తులు » పరిష్కారమవుతున్నవి స్వల్పమే

» అధికారులకు దృష్టిపెట్టడంలేదనే విమర్శలు » జూన్ 3 వరకు మరోసారి గడువు పెంచిన ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీలకు నందికొండ (నాగార్జునసాగర్) మునిసిపాలిటీలో ప్రభుత్వ స్థలాలేవీ లేవు. ఉన్న స్థలాలన్నీ ఎన్నెస్పీ, అటవీశాఖకు చెందినవే కావడంతో ఇక్కడ ఎల్‌ఆర్‌ఎస్‌కు మునిసిపల్‌శాఖ నోటిఫికేషన్ జారీచేయలేదు. మిగిలిన 18 మునిసిపాలిటీల్లో ఇప్పటివరకు 1,95,173 దరఖాస్తులు రాగా, 39,260 పరిష్కారమవడంతో రూ.107.57కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇంకా సుమారు 38వేల పైచిలుకు దరఖాస్తులు ఆమోదం పొందినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తికాలేదు. మిగిలిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రత్యేక వెబ్‌సైట్ అయినా సాంకేతిక సమస్యలు..

భూములను క్రమబద్ధీకరించి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్‌ను రూపొందించింది. యూజర్ మ్యాన్యువల్ ప్రీ రిజిస్ట్రేషన్ ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులేటరీ స్కీం-2020) పేరుతో ఈ వెబ్‌సైట్ ఏర్పాటుచేసింది. అంతేగాక ఆక్రమిత భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకొచ్చే దరఖాస్తుదారులకు వన్‌టైం సెటిల్‌మెంట్ అమలు చేసి నిర్ధారిత ఫీజులో 25శాతం రాయితీ కూడా ప్రకటించింది.అయితే సర్వర్లు బిజీగా ఉండడం, ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగకపోవడం, ఆక్రమిత స్థలాలు, భవనాల యజమానులు ముందుకు రాకపోవడంతో ఈ ప్రక్రియ మందకొడిగా సాగింది. ప్రధానంగా క్షేత్ర పరిశీలన ప్రక్రియ జాప్యమవడం, మొదటి దశలోనే దరఖాస్తు అప్‌లోడ్ కాకుండా ఆటంకాలు ఎదురవుతుండడం వంటి కారణాలతో క్రమబద్ధీకరణలో వేగం తగ్గింది. పైగా దరఖాస్తుదారులకు నేరుగా ఆటోజనరేటెడ్ మెసెజ్‌లు వెళ్లడంతో వారంతా ఒకేసారి మునిసిపల్ కార్యాలయాల వద్ద బారులుతీరారు. దీంతో సర్వర్లు మొరాయించడం వంటి సాంకేతిక సమస్యలు క్రమబద్ధీకరణ ప్రక్రియకు ఆటంకంగా మారింది.

క్షేత్రస్థాయి పరిశీలన పేరుతోనే ఎక్కువ పెండింగ్..

మునిసిపల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలో చేస్తున్న జాప్యం వల్లే ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి వంటి పాత మునిసిపాలిటీల్లో భారీగా దరఖాస్తులు రావడంతో క్షేత్రస్థాయి పరిశీలన ఇబ్బందికరంగా మారిందని, ఉద్యోగులకు సమయాభావంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. దీనికి తోడు నిబంధనలకు...

- మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ఇలా...

మునిసిపాలిటీ	వచ్చిన దరఖాస్తులు	పరిష్కారమైనవి	ఆదాయం (రూ.కోట్లలో)
నల్లగొండ	36,140	3388	20.87
సూర్యాపేట	35,633	6587	20.95
భువనగిరి	15,602	4386	11.99
మిర్యాలగూడ	14,336	2652	11.95
దేవరకొండ	5022	3411	0.75
హాలియా	3418	621	1.35
చిట్యాల	3209	480	1.06
నకిరేకల్	7080	605	1.20
చండూరు	3632	513	0.91
కోదాడ	16000	3600	12.00
నేరేడుచర్ల	3157	692	0.57
హుజూర్‌నగర్	4425	826	2.43
తిరుమలగిరి	6036	745	1.26
ఆలేరు	4700	1180	2.34
చౌటుప్పల్	16,571	4087	7.01
యాదగిరిగుట్ట	9000	2800	4.45
మోత్కూరు	3,660	1012	1.95
పోచంపల్లి	7552	1675	4.53
మొత్తం	1,95,173	39,260	107.57

'డయల్ యువర్ సైబర్ నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



గ్రీవెన్‌డేలో ఫిర్యాదులు తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): 'డయల్ యువర్ సైబర్ నేస్తం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 35 మంది ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకొని సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా కఠినంగా వ్యవహరించాలన్నారు. 'డయల్ యువర్ సైబర్ నేస్తం' కార్యకమంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు సలహాలు ఇవ్వడంతోపాటు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 11 నుంచి 2గంటల వరకు సైబర్ బాధితుల కోసం 'డయల్ యువర్ సైబర్ నేస్తం' నిర్వహిస్తామని బాధితులు సెల్ నంబర్ 8712658079కు కాల్ చేయాలని తెలిపారు.

కుటుంబ సర్వే రెమ్యునరేషన్‌ను చెల్లించాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబరు 6 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి నేటికీ రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ సర్వేను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిన సిబ్బందికి కొన్ని జిల్లాల్లో చెల్లింపులు చేసినా జిల్లాలో మాత్రం నేటికీ రెమ్యునరేషన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి మాట్లాడుతూ, గత మార్చి 18న కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. వారం రోజుల్లో రెమ్యునరేషన్ చెల్లించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేయగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, నాయకులు నర్రా శేఖర్‌రెడ్డి, వడిత్య రాజు, ఎడ్ల సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, ఎ.చిన్న వెంకన్న, కొమ్మరాజు సైదులు, మధుసూదన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను ఎంపికచేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా కేటాయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో అనర్హులు లేకుండా మండల ప్రత్యేక అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబితాలో అనర్హులు ఉంటే పూర్తి బాధ్యత మండల ప్రత్యేక అధికారులదేనన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గతంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయం పొందిన వారికి తిరిగి రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు అర్హత ఉండదని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాస పథకం లక్ష్యాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వారాంతానికి నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన ధర్తీ ఆబా యోజనకు ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పంపించాలని ఆదేశించారు. ఈ నెల 12న మిస్ వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్‌ని బుద్ధవనాన్ని సందర్శిస్తున్న దృష్ట్యా బుద్ధవనం, విజయవిహార్ వద్ద శానిటేషన్, లైటింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు వ్యక్తిగతంగా ఆహ్వానం పలకాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించి ఎండలో పని చేసే వారికి సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. పనిచేసే చోట నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నీట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులను కలెక్టర్ అభినందించారు. కాగా 'ప్రజావాణి'లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు వారి దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేశారు. కొన్నింటిని కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవోలు వై.అశోక్‌రెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత ఆలోచన విరమించుకోవాలి

రామగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యా కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలలను మూసివేయాలనే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య డిమాండ్ చేశాడు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలను శాస్త్రీయంగా పరిశీలించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులివ్వడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఒక కారణమేనని అన్నారు. గ్రామాల నుంచి బస్సుల ద్వారా విద్యార్థులను తరలిస్తున్నప్పుడు పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నందున మూసివేయాలనే ఆలోచన చేయడం ప్రజలందరికీ విద్యను దూరం చేయడమేనని అన్నారు. వేసవిలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు పి.ఏడుకొండలు, టి.వెంకటేశ్వర్లు, ఇ.జగతి, ఇ.అంజయ్య, ఎండి.ఖుర్షిద్ మియా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి

నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ఇళ్లుగా మారుస్తున్న అధికారులపై, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.

అత్యం త ప్రజాస్వామికంగా, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనలన్నీ అబద్ధాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకులు చెప్పేవారికే కేటాయిస్తున్నారని, దీనిపై విచారణ జరిపించాలన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని లేదంటే పేదలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, ఉయ్యాల లింగస్వామి గౌడ్, నాగిళ్ల యాదయ్య, బర్రె సంజీవ, ఆవుల నరసింహయాదవ్, మాదగోని పద్మ, గుణగంటి అండాలు, ఉయ్యాల ధనమ్మ, ఆవుల సునీత, పంగరెక్క కృష్ణయ్య, పంగరెక్క లలిత, గుణగంటి సైదులుగౌడ్, మాదగోని లింగస్వామిగౌడ్, కొత్త మల్లేష్‌గౌడ్, కొత్త ఈశ్వరమ్మ, గుణగంటి వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలోపీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పైప్‌లైన్ పనులు నిలిపివేయాలి

త్రిపురారం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి రెడీస్ పరిశ్రమకు నీటి తరలింపునకు ఏర్పాటుచేస్తున్న పైప్‌లైన్ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ అంతరభాగంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టిపోసి బండ్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి పైప్‌లైన్ల ఏర్పాటు పనులు జరుగుతుండగా గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి కొరత ఉండగా పరిశ్రమకు నీటిని తరలించడం ఏంటని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు సక్రమంగా లేక నీటి సరఫరా జరగడం లేదని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు పైప్‌లైన్ పనులను నిలిపివేయాలన్నారు. పనులు అడ్డగించిన వారిలో గ్రామస్థులు గుండెబోయిన వెంకటేశ్వర్లు, కొప్పు సోమయ్య, దైదా రవి, అల్లం నాగరాజు, మట్టపల్లి, సైదులు, సురేష్, తదితరులు ఉన్నారు.

పనులను అడ్డుకున్న పెద్దదేవులపల్లి గ్రామస్తులు



చెరువు వద్ద పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

వికసించిన మే పుష్పం

రామగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో రిటైర్డ్ ఎస్ఐ లింగయ్య ఇంట్లో మే పుష్పం వికసించింది. కొన్నేళ్ల క్రితం ఈ మొక్కను అతడు నాటగా, ఈ పుష్పం 15రోజుల పాటు వికసించే ఉంటుందని ఆయన తెలిపారు.



ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : నల్లగొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్, కట్టంగూర్

ACM - 9985411394

Nalgonda ACO - 9985410334, Nalgonda-1 ACO - 9985411407

Chandur SR - 9849337588, Chityala SR - 9010198664,

Nakrekal SR - 9963624250, Kattangoor SR - 9177221185

కొనుగోలుకు కొర్రీలు



కొండమల్లేపల్లిలో రైతులు సేద తీరడానికి తూతూ మంత్రంగా వేసిన గుడిసె

ఆంధ్రజ్యోతి విజిట్

» నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
» వివిధ పేర్లతో రైతు జేబులకు చిల్లులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల లక్ష్యం నీరుగారుతోంది. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యంతో ఎండవేడిమికి తాగునీరు, టెంట్ సౌకర్యం లేక హమాలీలు, కూలీలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలు, గన్నీబ్యాగుల కొరతతో ఎగుమతి, దిగుమతులు ఆలస్యమవుతున్నాయి. దీంతో రోజుల తరబడి కేంద్రాల వద్దే రైతులు పడికాపులు పడుతున్నారు. దీనికి తోడు కాంటా వేసేందుకు హమాలీలకు, ఇతర చార్జీలు, తాలు పేరుతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కొన్నిచోట్ల ఎగుమతి, దిగుమతి బాధ్యతలనూ రైతులపైనే వేస్తున్నారు. వెరసి కేంద్రాల్లో కర్షకులు దోపిడీకి గురవుతున్నారు.

తిరుమలగిరి(సాగర్) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు వచ్చిన రైతులకు నెల రోజులుగా కష్టాలు తప్పడంలేదు. రాజవరం కేంద్రంలో కాంటాలు వేయాల్సిన ధాన్యం సుమారు 10వేల బస్తాలు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అదేవిధంగా కాంటా వేసి ఉన్న ధాన్యం ప్రస్తుతం ఐదు లారీలకు సరిపడా ఉంది. గత ఐదు రోజుల్లో ఒకేఒక్క లారీ మాత్రమే ఎగుమతికి కేంద్రానికి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. సకాలంలో లారీలు రాకపోవడంతో రైతులు లారీల కోసం ఎదురు చూస్తున్నారు. కొంపల్లి కేంద్రంలో 10వేల బస్తాలకు సరిపడా ధాన్యం కుప్పల రూపంలోనే ఉంది. ఈ కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరతతో కాంటాలు నిలిచిపోయాయి. కేంద్రానికి పంపించిన బ్యాగుల్లో ఎక్కువ వాటికి చిల్లులు ఉన్నాయని రైతులు తెలిపారు. దీంతో హమాలీలతో పాటు మిల్లర్లు కూడా అభ్యంతరాలు పెడుతున్నట్లు నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు అన్ని కేంద్రాల్లోనూ ధాన్యం కాంటాకు సిద్ధంగా ఉండగా లారీల కొరత వేధిస్తోంది. మండలంలోని మేగ్యాతండా, చిలకాపురం, రంగుండ్ల కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఇటీవల వాతావరణ మార్పులతో అకాలవర్షాలకు ధాన్యం తడుస్తుందనే ఆందోళనతో రైతులు మదనపడుతున్నారు.

కనగల్ : కనగల్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలతో పాటు గన్నీ బ్యాగుల కొరత రైతులను వేధిస్తోంది. మండలంలో 28 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కేంద్రాల ద్వారా సుమారు 5 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెబుతున్నా ఇంకా లక్ష క్వింటాళ్ల ధాన్యం కేంద్రాల్లో పేరుకుపోయింది. ప్రస్తుతం లారీల కొరతతో దిగుమతి, ఎగుమతులు ఆశించిన మేర జరగడంలేదు. దీనికి తోడు గన్నీ బ్యాగుల కొరత రైతులను వేధిస్తోంది. రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాలు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇదిలాఉంటే నిన్న మొన్నటి వరకు లారీల కొరత వాస్తవమే అయినా ప్రస్తుతం దానిని అధిగమించి కొనుగోళ్లు వేగవంతం చేసినట్టు ఏపీఎం హరి తెలిపారు. మరో 10 రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు.

మునుగోడు రూరల్ : మునుగోడు మండలంలో 9 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. లారీల కొరతతో రైతులను వేధిస్తోంది. దిగుమతికి లారీలు మిల్లుల వద్ద మూడు, నాలుగు రోజులు పడిగాపులు పడుతున్నారు. దీంతో అటు కేంద్రంలోని రైతులు,లారీ యజమానులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ధాన్యం ఎగుమతికి రావడానికి లారీ యజమానులు జంకుతున్నారు. తమకు వెయిటింగ్‌చార్జీలు ఇస్తేనే వస్తామంటూ పేచీలు పెడుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం బస్తాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. అంతేకాకుండా అకాల వర్షాలు,గాలి దుమారంతో బస్తాలు తడిసిపోతున్నాయి. కాంటాలు కానీ ధాన్యం వరద పాలవుతోంది.

చండూరు, రూరల్ : చండూరు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లోనూ లారీల కొరత, ఎగుమతి సమస్య అధికంగా ఉంది. లోడుతో వెళ్లిన లారీలు నాలుగు రోజులకు తిరిగి రావడం లేదు. దీంతో ధాన్యం ఎగుమతులకు రావడానికి లారీ యజమానులు జంకుతున్నారు. దీంతో కేంద్రాల్లో ధాన్యం రాశులు, బస్తాలు పేరుకుపోతున్నాయి.

డిండి : లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8 కేంద్రాలు ఏర్పాటుచేశారు. లారీల కొరత కారణంగా ఎగుమతులు నిలిచాయి. రోజుకు ఒక లారీ మాత్రమే వస్తున్నట్లు రైతులు తెలిపారు. డిండి ప్రాజెక్టు ఆయకట్టులో వరికోతలు ముమ్మరం కావడంతో కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఆయాచోట్ల సరైన వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

హాలియా:కొత్తపల్లి కొనుగోలు కేంద్రంలో అకాలవర్షాలతో కాంటా వేసిన బస్తాలు తడిచాయి. అధికారులు మిల్లర్లతో మాట్లాడి పాక్షికంగా తడిసిన బస్తాలను గుర్తించి ఒక లారీ చొప్పున తరలించారు. ఇబ్రహీంపేట, కొత్తపల్లి కేంద్రాలలో స్థలభావంతో రైతులు రోడ్ల వెంటే ధాన్యాన్ని ఆరబోసుకున్నారు.

దిగుమతి ఆలస్యంతో తరుగు పేరుతో కోత

రాజాపేట: మండలంలోని సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో దిగుమతి చేయడంలో ఆలస్యమవుతోంది. కూలీల కొరతతో పాటు వేసవితాపంతో ఒక్కో లారీ ఖాళీ అయ్యేందుకు రెండు రోజల సమయం పడుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో తూకం తగ్గుతుందన్న సాకుతో తరుగు తీస్తున్నారు. పాముకుంట మినహా అన్నికేంద్రాలలో కాంటాలు జరుగుతున్నాయి. 170 టార్పాలిన్ పరదాలను రైతులకు అందజేశారు. ధాన్యం కుప్పలు అధికంగా ఉండటంతో అకాల వర్షాలతో రాశులపై కప్పేందుకు టార్పాలిన్లు సరిపోవడం లేదు.

ధాన్యం కొనుగోలు చేపట్టాలి



తుక్కాపురం కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తెచ్చి 15 రోజులైంది. తేమ, తాలు సాకుతో కొనుగోలు చేపట్టలేదు. దీంతో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. ఇటీవలి వర్షాలకు ధాన్యం తడవడంతో కల్లాలో ఆరబెట్టినా ఫలితం లేదు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలి.

– ఎలకొండ సంజీవరెడ్డి, రైతు తుక్కాపురం



తుక్కాపురంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

తేమ, తాలు సాకులు..

భువనగిరి రూరల్ : భువనగిరి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బందిపెడుతున్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని కేంద్రాల వద్ద ఆరబోస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు అకాల వర్షాలు పడడంతో ధాన్యం రాశులు కొంతమేర తడిసాయి. మండలంలో 21,650 ఎకరాల్లో సాగు చేయగా సుమారు 4,20, 500 క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. మండలంలో ఐకేఈ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినా మౌలికవసతులు కల్పించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఐకేపీ ఆధ్వర్యలంలో 445 మంది రైతులకు సంబంధించి 43,429 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. భువనగిరి పీఏసీఎస్ పరిధిలో 120 మంది రైతులకు సంబంధించి 46,250 క్వింటాళ్ళు, చందుపట్ల పరిధిలో 315 మంది నుంచి 18,550 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మూడు రోజులుగా నిలిచిన కొనుగోళ్లు



శాలిగౌరారం మార్కెట్‌లో లారీలు రాక పేరుకపోయిన ధాన్యం బస్తాలు

శాలిగౌరారం : శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో మూడు రోజుల నుంచి ధాన్యం ఎగుమతి చేయడానికి లారీలు రాకపోవడంతో కొనుగోళ్లు నిలిచాయి. కాంటాలు వేసిన ధాన్యం బస్తాలు మార్కెట్‌లో పేరుకుపోయాయి. దీంతో కాంటాలు వేయడం నిలిపివేశారు. మార్కెట్‌లో ఇప్పటివరకు 31,798 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుచేశారు. వెంటవెంటనే లారీలు రావడంతో మిల్లులకు తరలించారు. మూడు రోజుల నుంచి లారీలు రాకపోవడంతో 8వేల క్వింటాళ్ల ధాన్యం బస్తాలు మార్కెట్‌లో పేరుకుపోయాయి. రోజుకు ఆరు లారీలు వస్తే వారం రోజుల్లో మార్కెట్‌లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

లక్ష్యం పూర్తయిందని ఆలస్యం

చిట్యాలరూరల్ : చిట్యాల మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం మిల్లుల్లో దిగుమతిలో ఆలస్యమవుతోంది. మిల్లర్లకు కేటాయించిన లక్ష్యం పూర్తి కావడంతో దిగుమతి చేసుకునేందుకు వారు నిరాకరిస్తున్నారు. ఇది కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులపై ప్రభావం చూపెడుతోంది. మండలంలో 13 కేంద్రాల నుంచి బీ-రకం ధాన్యం రావడంతో మిల్లర్లు దిగుమతి చేసుకునేందుకు నిరాకరిస్తున్నారు. బీ-రకం ధాన్యంలో నూక శాతం అధికంగా వస్తుందని అనాసక్తి చూపిస్తున్నారు. వెలిమినేడు పరిధిలోని నాలుగు కొనుగోలు కేంద్రాల ధాన్యం మిర్యాలగూడ మిల్లులకు, పెద్దకాపర్తికి కేంద్రం ధాన్యం వట్టిమర్తిలోని హనుమాన్ రైస్ మిల్లుకు పంపిస్తున్నారు. అయితే ఆయా మిల్లుల లక్ష్యం పూర్తికావడంతో చిట్యాల శివారులోని లక్ష్మీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ లక్ష్యం పూర్తయిందని చెబుతున్నారు. దీంతో దిగుమతికి నిరాకరిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా చిట్యాల మండలంలో సేకరించిన ధాన్యాన్ని దూర ప్రాంతమైన మిర్యాలగూడ రైస్‌మిల్లులకు కేటాయించడంతో రవాణా ఆలస్యమవుతోంది. ఏ చిన్న సమస్య వచ్చినా సిబ్బంది అక్కడికి వెళ్లి రావాలంటే వేసవిలో ప్రయాణంతో బడలిపోతున్నారు.

రైతులపై హమాలీ భారం



మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా బస్తాలు

భూదాన్‌పోచంపల్లి: కొనుగోలు కేంద్రాల్లో తూకాలువేసి, బస్తాలకు లారీలోకి ఎక్కించినందుకు హమాలీ చార్జీల భారమంతా అన్నదాతలపై వేస్తున్నా రు. కొన్ని కేంద్రాల్లో బస్తాకు రూ.20-30 చొప్పున, మరికొన్ని చోట్ల క్వింటాకు రూ. 50-60వరకు తీసుకుంటున్నారు.హమాలీ చార్జీలకే రూ.1000కి దాటి చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు లారీ డ్రైవర్ల భోజనాల కోసం బస్తాకు రూ.2వసూలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ధాన్యాన్ని తూర్పార పట్టేందుకు గాలిపంకాకు గంటకు రూ.700చొప్పున చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. అన్ని సరిగ్గా ఉన్నా తాలు,తేమ పేరుతో కోత విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సుతిలి, తాలు పేరుతో రూ.600 వసూలు




మైలారిగూడెంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట డివిజన్ వ్యాప్తంగా 6 మండలాలో 71 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో ప్రతీ సమస్య రైతులను వెంటాడుతోంది. కనీస సౌకర్యాలు కల్పించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. నీడ కోసం టెంట్, దాహారం తీర్చడానికి నీళ్ల కూడా ఏర్పాటు చేయలేదంటున్నారు. తేమ పేరుతో కొనుగోళ్ల ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సుతిలి, తాలు, బస్తాలు, కూలీలకు ట్రాక్టర్ పేరుతో రూ.600 వసూలు చేస్తున్నారని రైతులు తెలిపారు. దీనికి తోడు ధాన్యం ఎగుమతి, దిగుమతి బాధ్యతలను రైతులకే కట్టబెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

డబ్బులిస్తేనే కాంటాలు..

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని కొనుగోలు కేంద్రాల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. డబ్బులిస్తే తేమ రాకున్నా కాంటా వేస్తున్నారని, రాజకీయ నాయకులకు సంబంధించినవి ముందే కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కంచనపల్లి కేంద్రంలో కొనుగోళ్లకు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇదేమని ప్రశ్నించిన రైతులను ఇబ్బంది పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. లారీ కొరత వేధిస్తుండగా, డబ్బులివ్వకుంటే కాలయాపన చేస్తున్నారని అన్నికేంద్రాల్లో ఇదే తంతు కొనసాగుతుందని విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు అకాల వర్షాలకు ధాన్యం తడిసి తేమ పెరగడంతో పాటు మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టార్పాలిన్ల అద్దెకు రూ.5 వేలు



కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారు. ఎండలో సేదతీరడానికి టెంట్లు ఏర్పాట్లు చేయలేదు. దీంతో చెట్ల నీడ పట్టునే రైతులు సేదతీరుతున్నారు. లారీల సాకుతో కొనుగోళ్ల ఆలస్యమవుతుండటం, అకాలవర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం ఆరబోతకు గతంలో 50శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేశారు. ప్రస్తుతం వాటి సరఫరా నిలిపివేయడంతో అద్దెకు తెచ్చుకుంటున్నారు. దీంతో ధాన్యం కాంటా అయ్యే నాటికి రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అద్దె భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం తెచ్చి 20 రోజులైంది



దాదాపు 20 రోజుల కిందట ధాన్యం తీసుకొచ్చా. తేమ వచ్చి ఆరు రోజులు. లారీల కోసం ఎదురుచూస్తున్నాం. గాలి దుమారంతో వర్షం పడుతుండడంతో నానా అవస్థలు పడుతున్నాం. కొనుగోళ్లను వేగవంతం చేయాలి.

– మూఢావత్ సునీత, బాబ్లాతండా

కలెక్టర్ ఆదేశాలతో మారిన తీరు...



ధాన్యం లారీ

బొమ్మలరామారం : కలెక్టర్ ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ పద్ధతి మార్చుకున్నారు. గతంలో కాంట వేసినా లారీ అన్‌లోడ్ అయిన తర్వాతే బిల్లు చేసేవారు. కానీ యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలతో కాంట అయిన వెంటనే బిల్లు చేస్తున్నారు. ఎలాంటి కటింగు పెట్టడంలేదు. మండల వ్యాప్తంగా మొత్తం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పటి వరకు 40 వేల బ్యాగుల కొనుగోలు చేశారు. ఆయా కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, తాగునీరు. నీడ సౌకర్యం అంతంత మాత్రమే ఏర్పాటుచేశారు. ఒక్కో సెంటర్‌లో 10కి మించి టార్పాలిన్లు లేవు. హాజీపూర్‌లో 15 రోజుల కిందట కేంద్రం ప్రారంభించారు. హమాలీల కొరతతో 3 రోజుల క్రితం కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రారంభించిన మూడు రోజుల్లోనే హమాలీలు చెప్పకుండానే వెళ్లిపోయారు. దాంతో కొనుగోళ్లు నిలిచాయి.

కష్టిస్తున్న హమాలీలు

చౌటుప్పల్ టౌన్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకాలు వేసే హమాలీలు, రైతులు ఎర్రటి ఎండలకు మాడిపోతున్నారు. పీఏసీఎస్ కింద 12, రైతు ఉత్పత్తిదారుల సంఘం కింద ఒకటి, ఐకేపీ కింద 4 కేంద్రాలలో సుమారు 400 మంది హమాలీలు ధాన్యం తూకాలు వేస్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉండటంతో రైతుల ఆవేదనను పరిగణలోకి తీసుకుంటున్న హమాలీలు రోజుకు 10 గంటల పాటు తూకాలు వేస్తున్నారు. అదే క్రమంలో తూకాలు వేసిన బస్తాలను ఎప్పటికప్పుడు లారీల్లోకి ఎగుమతి చేస్తున్నారు. ఎండల తీవ్రతతో హమాలీల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



చౌటుప్పల్ యార్డులో ఎర్రటి ఎండలో ధాన్యం తూకాలు వేస్తున్న హమాలీలు

● వేగంగా సాగుతున్న కొనుగోళ్లు...

కేతేపల్లి : యాసంగి ధాన్యం కొనుగోళ్ళకు కేతేపల్లి మండలంలో ఏర్పాటు చేసిన 13కేంద్రాలలో ముమ్మరంగా సాగుతున్నాయి. మూసీ కుడి కాల్వ, ఏఎమ్మార్పీ ఆయకట్టుతో పాటు బావులు, బోర్ల నీటి సాయంతో మండలంలో దాదాపు 22వేల ఎకరాల్లో రైతులు యాసంగి వరి సాగు చేశారు. 4,60 లక్షల క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు మండలంలోని 16గ్రామపంచాయతీలకు 9 గ్రామాల్లో పీఏసీఎస్, 2గ్రామాల్లో డీసీఎంఎస్, మరో 2గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. చీకటిగూడెంలో కొనుగోళ్లు పూర్తవడంతో ఈ నెల 4న కేంద్రాన్ని మూసివేశారు. ఇనుపాముల, కొండకిందిగూడెం, చెరుకుపల్లి, బీమారం, తుంగతుర్తి, కొప్పోలు, కొత్తపేట, కొర్లపహాడ్ కేంద్రాల్లో ఒకటి, రెండు రోజుల్లో కొనుగోళ్ళు పూర్తికానున్నాయి. గుడివాడ, ఇప్పలగూడెం కేంద్రాలకు భారీ లారీలు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక రవాణాలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనికి తోడు భారీ లారీలు గ్రామాల్లోని నివాస గృహాల మధ్య నుంచి ఇరుకు, మలుపులతో వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో గృహాలు దెబ్బతినే ప్రమాదం ఉండడంతో చిన్న లారీలతో ధాన్యం రవాణా చేస్తున్నారు.

● బిహార్ కూలీలతో కాంటా

వలిగొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత వేధిస్తోందని రైతులు వాపోతున్నారు. కాంటా వేయడంపై స్థానిక హమాలీలు శ్రద్ధచూపకపోవడం, ఎండ తీవ్రత, ఆరోగ్య సమస్యల కారణంతో కొనుగోలు కేంద్రాలకు రావడం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు బిహార్ రాష్ట్ర కూలీలపై ఆధారపడాల్సి వస్తోందంటున్నారు. అయితే వారికి డిమాండ్ పెరగడంతో, కాంటాల్లేక కొనుగోళ్లు ఆలస్యమవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.



వలిగొండ కొనుగోలు కేంద్రంలో బిహార్ కూలీలు

శివకేశవులకు విశేషపూజలు



శివాలయంలో పూజలు జరుపుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేషపూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి, అమ్మవార్లకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో మూలమూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తుల వద్ద విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులను అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,63,736 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం అంతంతే!

(5వ పేజీ తరువాయి)

విరుద్ధంగా ఆక్రమణలు చేసినవారు, ప్రభుత్వ పార్కులు, వాటర్‌బాడీస్‌లోకి చొచ్చుకెళ్లిన వారు, ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేసినవారు సైతం ఈ ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారని, దీంతో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ జాప్యమయిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పెంచిన గడువులోనైనా దరఖాస్తులు పరిష్కరించాలి

ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకుంటే సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఎల్-1 దశలోనే దరఖాస్తులకు బ్రేకులు పడుతున్నాయని వినియోగదారులు వాపో తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మూడంచెల విధానాన్ని అమలుచేస్తున్నారు. క్రమబద్ధీకరణకు సర్వర్ సమస్యలు, ఇతర సమస్యల నేపథ్యంలో ఎల్-1వద్దనే బ్రేకులు పడడంతో ఉమ్మడి జిల్లాలో పెద్దసంఖ్యలో దరఖాస్తులకు మోక్షం కలగలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వానికి ఆదాయమిచ్చే పథకం కావడంతో అధికారులు దృష్టిసారించి జూన్ 3లోగానైనా అప్‌లోడ్ చేసిన దరఖాస్తులను పరిష్కరించి, రిజిస్ట్రేషన్లకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాలి



కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

మోటకొండూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాణాలకు భరోసా కల్పించాలని కాటేపల్లి ప్రీమియర్ కంపెనీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలోని ప్రీమియర్ కంపెనీ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికులకు పనిఒత్తిడి లేకుండా చేయడంతో పాటు బిల్డింగ్‌లలో పనిచేసే కార్మికుల ప్రాణాలకు భరోసాతో పాటు రక్షణ కల్పించాలన్నారు. కాంట్రాక్టర్ పద్ధతిని తొలగించి కంపెనీ వర్కర్లుగా తీసుకోవాలన్నారు. పని ఏళల్లో మార్పులు చేస్తూ ఎనిమిది గంటలకు తగ్గించి, పర్మినెంట్ ఉద్యోగులకు బేసిక్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంపెనీలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలన్నారు. ధర్నా సమయంలో కంపెనీలోకి వాహనాలను వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ కార్మికులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఏలేందర్, నాగిరెడ్డి, చందు, నవీన్, ప్రవీణ్, నాగరాజు, నాగర్జున, సిద్ధులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

NAME CHANGE

★ I, Munagala Kovid, S/o. Srinivas Chary, Age:24, Occ: Student (Old Name) R/o. Rangundla (V), Thirumalagiri (Sagar) (M), Nalgonda (Dist.), T.S. have changed my name as MUNAGALA RAM S/o. Srinivas Chary (New Name). For all purposes.

AJY_

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413365 9985413656

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలైన ప్రక్రియ
- కేంద్ర పథకాలు రైతులకు త్వరగా అందేలా కార్యాచరణ
- మొత్తం 10లక్షలకు పైగా రైతులకు ప్రయోజనం



నల్లగొండ మండలం అర్జాలబావిలో పేర్లు నమోదు చేయించుకుంటున్న రైతులు

నల్లగొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆధార్ తరహాలో 11అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులను కేటాయించేందుకు (ఫార్మర్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియ సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. తొలుత నెల రోజుల పాటు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టనుండగా ఆ తరువాత మీ సేవా, ఏజెన్సీల ద్వారా ఈకార్యక్రమం కొనసాగనుంది. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు ఈ గుర్తింపు కార్డు ఇక నుంచి ప్రామాణికం కానుంది. ప్రస్తుతం నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలోని 140కిపైగా రైతు వేదికల్లో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన పట్టాదారు పాసుపుస్తకంలోని భూ యాజమాన్య వివరాల నమోదు ద్వారా రైతులకు 11 అంకెలతో ఉన్న గుర్తింపు కార్డును కేటాయిస్తారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలైన పీఎం కిసాన్‌తో పాటు పంటలబీమా, మౌలిక సదుపాయాల కల్పన వంటి పథకాలను అమలు చేయనున్నారు. ఇప్పటివరకు సరియైన గణాంకాలు ఉన్న ధ్రువీకరణ పత్రాలు నమోదు కాకపోవడం, వివరాలు లేకపోవడంతో రైతులకు సకాలం లో పథకాలు అందడం లేదని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించి ఈ పథకాన్ని ప్రారంభించింది.

ఉమ్మడి జిల్లాలో 10.27లక్షలకు పైగా రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10,27,532 మంది రైతులు ఉన్నారు. ఇందులో నల్లగొండ జిల్లాలో 5.40 లక్ష మంది, యాదాద్రి భువనగిరిలో 1,57,206 లక్షల మంది రైతులు, సూర్యాపేట జిల్లాలో 3,30,326 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరందకీ విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు.. ఆగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇప్పటికే మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు భూ యజమాన్య పట్టదారు పాసుపుస్తకం ఆధార్, ఫోన్ నెంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.అనంతరం లబ్ధిదారులకు ఓటీపీ వస్తుంది. దానిని ధ్రువీకరించుకున్న తరువాత రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఈ సంఖ్యను కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అనుసంధానం చేస్తారు. పీఎం కిసాన్‌లో వచ్చే విడత నిధుల విడుదలకు దీనిని ప్రామాణికంగా కేంద్ర ప్రభుత్వం తీసుకోనుంది.

వివరాల డిజిటలైజేషన్‌కు..

గతంలో అధికార యంత్రాంగం రైతుల వివరాలను డిజిటలైజేషన్ చేయడానికి సమస్యగా ఉండేది. దీంతో కేంద్ర ప్రభుత్వం వీటన్నింటి పరిష్కారాలకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. గతంలోనే కేంద్ర ప్రభుత్వం అనేక రాష్ట్రాలల్లో నమో దు చేయగా తెలంగాణలో మాత్రం వాయిదా పడింది. తాజాగా ఆగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఈ పథకాలకు రాష్ట్రంలో అమలయ్యే రైతుభరోసా, రుణమాఫీ ప్రక్రియలకు ఎలాంటి సం బంధ లేదని స్పష్టం చేసింది. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యజమాన్య వివరాలే ప్రమాణికంగా ఉంటాయని వ్యవసాయశాఖ పేర్కొంది. మొత్తానికి విశిష్ట కార్డులు అందుబాటులోకి రానుండటంతో సమస్యలు తొలగిపోయే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పవచ్చు. త్వరితగతిన విశిష్ట గుర్తింపుకార్డులను అందజేసేలా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. ఈ నెల రోజులు వ్యవసాయ శాఖ రైతు వేదికల ద్వారా నమోదు కార్యక్రమం చేపట్టనుంది. ఆ తరువాత మీసేవలు, ఏజేన్సీల ద్వారా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి



నెలరోజుల పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతాం. అదేవిధంగా మీసేవల ద్వారా కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. రైతులు విధిగా ఈ విశిష్ట సంఖ్యకు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్ మాదిరిగానే త్వరలో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు కేటాయించడం జరుగుతుంది. ఈ గుర్తింపు కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం కానుంది.
- శ్రవణ్ కుమార్ జేడీఏ, నల్లగొండ

మిస్ వరల్డ్ పోటీదారులకు కట్టుదిట్టమైన భద్రత

- దేవరకొండ అడిషనల్ ఎస్పీ మౌనిక
- సాగర్‌లో ఏర్పాట్లపై సమీక్ష



సాగర్‌లో భద్రత ఏర్పాట్లను సమీక్షిస్తున్న అదనపు ఎస్పీ మౌనిక

నాగార్జునసాగర్, మే5(ఆంధ్రజ్యోతి): బుద్ధపూర్ణిమ సందర్భంగా ఈనెల 12న మిస్‌వరల్డ్ పోటీ దారులు నాగార్జునసాగర్‌ను సందర్శిస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవరకొండ అదనపు ఎస్పీ మౌనిక తెలిపారు. మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే విజయ్‌విహార్ అతిథిగృహం, బుద్ధవనాన్ని సోమవారం ఆమె సందర్శించారు. అనంతరం బుద్ధ వనంలోని సమావేశ మందిరంలో హాలియా, నాగార్జునసాగర్ సర్కిళ్ల పరిధిలోని పోలీసు అధికారులు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు సాగర్‌కు వచ్చి తిరిగి వెళ్లే వరకు భద్రత విషయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. సమీక్షా సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్, హాలియా సీఐలు శ్రీనునాయక్, జనార్దన్‌గౌడ్, ఎస్‌ఐలు సంపత్‌గౌడ్, వీరబాబు, వీరశేఖర్, సతీ‌ష్‌రెడ్డి, రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యం

కొండమల్లేపల్లి, మే 5, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో ఆదివారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ రామ్మూర్తి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ముడుసు కార్తీక్(28) కారు డ్రైవర్‌గా జీవనంసాగిస్తున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని రైస్‌మిల్లు వద్ద ఉన్న బంధువుల వివాహానికి హాజరయ్యాడు. వివాహానంతరం మధ్యాహ్నం ఈత కొట్టడానికి చింతకుంట్ల గ్రామంలోని ఓ బావిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు ఈ ఘటన చేసుకుందని తెలిపారు. మృతుడికి తల్లి, తమ్ముడు ఉన్నట్లు సమాచారం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూర్‌నగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) :ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన గోపాలదాసు నరేందర్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సోమవారం హుజూర్ నగర్‌కు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గడ్డి వాము దగ్ధం

నూతనకల్, మే5(ఆంధ్రజ్యోతి): మిర్యాల గ్రా మంలో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధమైంది. బాధిత రైతు అనంతుల లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం తన బావి దగ్గర వాము పెట్టిన సుమారు 200 మోపులకు విషార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకుని గడ్డి వాముతో పాటు, ప్రక్కనే ఉన్న పశువుల కొట్టం దగ్ధమైంది. సూర్యాపేట నుండి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పి వేసింది.

తొలి జాబితాలో పేరు లేకుంటే ఆత్మహత్యే శరణ్యం

- బీఆర్ఎస్ సభకు వెళ్లానని పేరు లేకుండా చేశారు
- ఆత్మహత్య చేసుకుంటానని యువకుడి బెదిరింపు



పురుగులమందు డబ్బాతో సాయి

గుర్రంపోడు, మే 5(ఆంధ్రజ్యోతి): తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఓ యువకుడు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశాడు. సోమవా రం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాల్వాయి గ్రామానికి చెందిన ముండ్ల సాయి గ్రామంలో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం గ్రామంలోనే వారసత్వంగా వచ్చిన రేకుల ఇంట్లో నివా సం ఉంటున్నాడు. గుంట భూమి కూడా లేదు. అయితే ఇటీవల గ్రామంలో నిర్వహించిన సర్వేలో 99మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులు గా ఎంపిక చేశారు. తొలి విడతగా 37 మంది ఎంపికైనట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ద్వారా తెలుసుకున్నాడు. దీంతో తన పేరు లేదని, ఏప్రిల్ 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన కేసీఆర్ సభకు వెళ్లడంతోనే తన పేరు రాకుండా చేశారని, కాంగ్రెస్ కార్యకర్తలను మాత్రమే లబ్ధిదారులుగా ఎం పిక చేశారని ఆరోపిస్తూ ఓ వీడియో రికార్డు చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. వర్షం వస్తే తన ఇల్లు కురుస్తోందని అన్నివిధాలా తాను మొదటి విడతలోనే అర్హుడినని, స్థానిక కాంగ్రెస్ నాయకులు కావాలని తన పేరు రాకుండా చేస్తు న్నారని ఆరోపించాడు. తన పేరు అర్హుల జాబితాలో లేకపోతే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. అధికారులు స్పందించి తనకు ఇందిరమ్మ ఇంటిని ఇప్పించాలని కోరాడు.

భార్యను వేధిస్తున్నాడనే హత్య

- గోపాల్‌పూర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న యాదగిరిగుట్ట సీఐ కొండల్‌రావు

తుర్కపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో ఐదు రోజుల క్రితం హత్యకు గురైన యువకుడి కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడ్డ నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను యాదగిరిగుట్ట సీఐ కొండల్‌రావు సోమవారం తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన వివాహిత మహిళను అదే గ్రామానికి చెందిన దాసారం సాయికుమార్(21) ఆరు నెలలుగా అసభ్యకరంగా వేధిస్తున్నాడు. సదరు మహిళ ఈ విషయాన్ని భర్త తలారి ఆంజనేయులకు తెలిపింది. దీంతోఆంజనేయులు తన భార్య జోలికి రావద్దని సాయికుమార్‌ను పలుమార్లు హెచ్చరించాడు. అయినా అతడి తీరులో మార్పు రాలేదు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ఆంజనేయులు సాయికుమార్‌ను హత మార్చాలని ప్రణాళిక రూపొందించాడు. తన బంధువులైన తలారి కొండయ్య, తలారి వెంకటేశ్, సిద్దిపేట జిల్లా ములుగు మండలం బలింపురం గ్రామానికి చెందిన గువ్వ రమేశ్ సాయం తీసుకున్నాడు. ఈ నెల 1వ తేదీ సాయంత్రం సాయికుమార్ తన బావి వద్దకు వెళ్తుండగా వెంబడించి అతనిపై దాడి చేశారు. ఇనుప రాడ్‌తో తలపై కొట్టి, టవల్, డ్రిప్ పైపుతో మెడకు చుట్టి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఆంజనేయులు బంధువైన రమేశ్ కారులో మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా ములుగు మండలం బస్వాపూర్ శివారులోని సింగన్న గూ డెం గ్రామంలోని అటవీప్రాంతంలో మృతదేహాన్ని డీజిల్ పోసి మృతదేహాన్ని కాల్చి వేసి నట్లు సీఐ తెలిపారు. కాగా దాసారం రాములుకు తన కుమారుడు సాయికుమార్ కనిపించడం లేదని ఈనెల 2న తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా డు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బస్వాపూర్ శివారులో యువకుడిని హత్య చేసి దహనం చేసిన గుర్తు తెలియని శవం ఆచూకీ ములుగు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ములుగు పోలీసులు మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రిలో మార్చురీలో ఉంచి చుట్టు పక్కల ఉన్న పోలీస్‌స్టేషన్లకు సమాచారం అం దించారు. తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో పోలీస్‌లు సాయికుమార్ తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. ఆయన కుటుంబ సభ్యు లు మార్చురీకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై ఉన్న టాటును గుర్తించి తమ కుమారుడు సాయి కుమాడేనని తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో తన కుమారుడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని సాయికుమార్ తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ ప్రారంభించి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా సాయికుమార్‌ను తామే హత్య చేసినట్లుగా తలారి ఆంజనేయులు, తలారి కొండ య్య, గువ్వ రమేశ్, తలారి వెంకటేశ్ అంగీ కరించారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ తక్యుద్దీన్, పోలీస్‌లు జె. రవికుమార్, ప్రదీప్‌కుమార్, రవినాయక్, నర్సింహ, శివకుమార్, మీరా హుస్సేన్ ను భువనగిరి డీసీపీ ఆకాంశ్ యాదవ్, యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్‌కుమార్ అభినందించారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, రైల్వే ఎస్పీ చందనాదీప్తి
- భువనగిరి మండలంలో 2వేల కిలోల గంజాయి ధ్వంసం

భువనగిరి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, రైల్వే ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. 2024-25కు సంబంధించి 74 కేసుల్లో పట్టుబడిన రూ. 10కోట్ల విలువైన 2,010 కిలోల గంజాయిని సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురం శివారులోని రోమా బయో ఇండస్ట్రీలో దహనం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సికింద్రాబాద్ అర్బన్, సికింద్రాబాద్ రూరల్, ఖాజీపేట డివిజన్ల పరిధిలో నమోదైన 74కేసులకు సంబంధించి ఎక్కువ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గతానికి భిన్నంగా అధిక మొత్తంలో గంజాయిని తరలిస్తున్న వారిని పట్టుకోవడంలో రైల్వే పోలీసు సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నారని అభినందించారు. గంజాయి అక్రమ రవాణాకు విక్రయదారులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని, వారి వ్యూహాలకు దీటుగా తాము వ్యవహరిస్తున్నామన్నారు. 2024- 25కు సంబంధించి సికింద్రాబాద్ అర్బన్ పరిధిలో 49కేసుల్లో రూ.7,09,61,450 విలువైన 1419కిలోలు, సికింద్రాబాద్ రూరల్ పరిధిలో 5 కేసుల్లో రూ. 50,42,100 విలువైన 100 కిలోలు, ఖాజీపేట డివిజన్‌లో 20కేసుల్లో రూ.2,45,03,200 విలువైన 419 కిలోల గంజాయిని కాల్చివేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా నియంత్రణలో భాగంగా రైల్వేస్టేషన్లలో నూతనంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రూరల్, అర్బన్ రైల్వే డీఎస్పీలు కె.శ్రీనివాస్‌రావు, ఎస్ఎన్.జావీద్, ఖాజీపేట రైల్వే డీఎస్పీ టి.కృపాకర్, రోమా బయో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్, సికింద్రాబాద్, ఖాజీపేట రైల్వే డివిజన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



గంజాయిని పరిశీలిస్తున్న చందనాదీప్తి

నేడు మునుగోడులో టీడీపీ సన్నాహక సమావేశాలు



చౌటుప్పల్‌లో మాట్లాడుతున్న లక్ష్మయ్య , రాపోలు నర్సింహ

చౌటుప్పల్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మంగళవారం టీడీపీ సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య తెలి పారు. చౌటుప్పల్ పట్టణంలోని భీమిడి మోహన్‌రెడ్డి భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్థాన్ నారాయణపురం, మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ, గట్టుప్పల్ మండల కేంద్రాలలో టీడీపీ సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో రాపోలు నర్సింహ, మండల నాయకులు నల్ల పర్వతాలు, పి. గోవిందా చారి, గోశిక పాండు పాల్గొన్నారు.

బరిలో దిగితే బంగారు పతకమే

- మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న అక్కాతమ్ముడు
- జాతీయ స్థాయిలో అనేక గోల్డ్ మెడల్స్ వీరి సొంతం

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనే నానుడిని నిజం చేస్తూ చిన్నప్పటి నుంచే విద్యతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్నారు అక్కాతమ్ముడు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త పాతనబోయిన సంతోష్‌కుమార్ ప్రియాంక దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ అక్కాతమ్ముడు సుదీ క్ష, విహాస్ దుర్గాలు మార్షల్ ఆర్ట్స్‌లో బరిలో దిగితే బంగారు పతకం సాధిస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



బహుమతులు అందుకుంటున్న సుదీక్ష, విహాస్ దుర్గ (ఫైల్)

చలకుర్తి గ్రామానికి చెందిన ఈ అక్కాతమ్ముడు ఇద్దరు చిన్నప్పటి నుంచి నుంచే(ఐదేళ్ల వయస్సు) తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తమకు ఇష్టమైన మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్నారు. 2021లో నాగార్జునసాగర్‌లో మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు శ్రీనివాస్ కరాటేలో శిక్షణ ప్రారంభించారు. ఆ తర్వాత కొంతకాలానికి తల్లిదండ్రులు నల్లగొండకు వ్యాపారం నిమిత్తం నల్లగొండ వెళ్లారు. అక్కడ తైక్వాండోలో కోచ్ యూనిస్ వద్ద శిక్షణ పొం దారు. 2024లో హైదరాబాద్‌లో మాస్టర్ మహే ష్ వద్ద కరాటే లో కూడా శిక్షణ ప్రారంభించారు. శిక్షణలో ఉండగానే అక్కా తమ్ముడు ఇద్దరు మండల, జిల్లా స్థాయిలో అనేక పతకాలు సాధించా రు. దీంతో మరింతగా మార్షల్ ఆర్ట్స్‌పై మక్కువ పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లారు. ఏ పోటీకి వెళ్లినా బంగారు పతకం సాధిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం సుదీక్ష 7వ తరగతి చదువుతుండగా, విహాస్ దుర్గ 5వ తరగతి చదువుతున్నాడు. చిన్నారుల ప్రతిభను చూసి చిన్నారులను ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, అభినందనలు పొందారు. ఇలా చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తూ అనేక బంగారు పతకాలు సాధిస్తున్న చిన్నారులను తల్లిదండ్రులతో పాటు కోచ్‌లు, ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం



మార్షల్ ఆర్ట్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించమే మా లక్ష్యం, ఒలింపిక్స్‌లో భారతదేశం తరుపున పాల్గొని బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తాం.
- సుదీక్ష, విహాస్ దుర్గ

విహాస్ దుర్గా సాధించిన పతకాలివే..

- తన 5వ ఏటనే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణను ప్రారంభించిన విహాస్ దుర్గ పలు పోటీల్లో బంగారు పతకాలు సాధి ంచాడు.
- 2021లో సుమన్ షోలో నిర్వహించిన 23వ జాతీయ కరాటే పోటీల్లో కటా విభాగంలో బంగారు పతకం.
- 2022లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం.
- 2022,23లో తైక్వాండోలో ఎల్లో, బ్లూ బెల్టు
- 2023సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో 25 కిలోల విభాగంలో బంగారు పతకం.
- 2024 లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిన 8వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ పోటీల్లో బంగారు పతకం.
- 2025 లో హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం.
- 2025లో కరాటే ఆర్గనైజేషన్ హైదరాబాద్‌లో నిర్వహించిన కుమిథే పోటీల్లో బంగారు పతకం.
- 2025 లో తమిళనాడు ప్రభుత్వం ఊటీలో నిర్వహించిన 15వ బ్రేవ్ ఫైటర్స్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో కటా, కుమితే విభాగాల్లో బంగారు పతకాలను సాధించాడు

సుదీక్ష సాధించిన పతకాలివే..

- 2022లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం.
- 2022,23లో తైక్వాండో పోటీల్ల ఎల్లో,బ్లూ బెల్ట్.
- 2023,24 సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిన 37వ జాతీయ సబ్ జూనియర్ పోటీల్లో 29,24 కిలోల విభాగాల్లో బంగారు పతకాలు
- 2024 లో కరాటేలో ఎల్లో బెల్టు.
- 2025లో ఏపీలో వైజాక్‌లో నిర్వహించిన 8వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో వెండి పతకం, కుమిథే విభాగంలో రజత పతకం.
- 2025లో కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కుమిథే విభాగంలో బంగారు పతకం.
- 2025లో తమిళనాడు ప్రభుత్వం ఊటీలో నిర్వహించిన 15వ బ్రేవ్ ఫైటర్స్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ కటార్, కుమిథే విభాగాల్లో బంగారు పతకాలు.

లారీ బైక్‌ను ఢీకొట్టడంతో మహిళ దుర్మరణం

గుర్రంపోడు, మే 5 (ఆంధ్రజ్యోతి) : లారీ, బైక్‌ను ఢీకొట్టడంతో మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం దేవరకొండ ప్రధాన రహదారిపై చేపూరు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బాలాపూర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ సలామ్, అంజుమ్‌ఖాతూన్(43) దంపతుల కుమార్తె మండలంలోని పోచంపల్లి గ్రామంలోని ఓ రైతు తోటలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటుంది. అయితే కుమార్తె సఖీనా ఖాతూన్ అల్లుడు మహ్మద్ సలామ్‌లను చూసేందుకు హైదరాబాద్‌నుంచి ఉదయం వచ్చారు. అనంతరం వీరు పని మీద చేపూరు గ్రామానికి వెళ్లి అల్లుడి బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈప్ర మాదంలో బైక్ పై ప్రయాణిస్తున్న అంజుమ్‌ఖాతూన్ అక్కడికక్కడే మృతి చెందగా అబ్దుల్ సలామ్, అల్లుడు మహ్మద్ సలామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కూతురు సఖీనా ఖాతూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు.

తాటి చెట్టు పైనుంచి గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన ఎల్లయ్య

మద్దిరాల, మే 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని పోలుమళ్ల గ్రామంలో ప్రమాదవశాత్తు సోమవారం తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాగిరి ఎల్లయ్యగౌడ్ వృత్తిలో భాగంగా రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతున్నాడు. గాలి ధూమారం రావడంతో ఒక్కసారిగా మోకు జారడంతో చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. ఎల్లయ్యకు గాయాలు కావడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన గీత కార్మికున్ని కుటుంబాన్ని ఆదుకోవాలని గీత సంఘం నాయకులు కోరారు.

పుస్తెల తాడు చోరీ

కొండమల్లేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని వడ్త్య తండాలో సోమవారం తెల్లవారుజామున రాజు అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడునదొంగలించినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శేరుబావిగూడెంలో మే డే పతాకావిష్కరణ

నార్కట్‌పల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మేడే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శేరుబావిగూడెంలో సోమవారం మే డే పతాకాన్ని సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి అలుగుబెల్లి లింగారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, మాజీ ఎంపీటీసీ కుమ్మరి శంకర్, నాయకులు దండు రవి, బొల్లేద్దు సైదులు, వీరనేని శంకర్‌రావు, శ్రీను, రాఘవరెడ్డి, ఆదిరెడ్డి, చలపతిరెడ్డి, భగవంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వారికి జరిమానా

చిట్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న షాప్ యాజమానులకు మునిసిపల్ అధికారులు జరిమానా విధించారు. సోమవారం దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న పలు దుకాణాల యజమానులకు రూ.500 వరకు జరిమానా విధించారు.

కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మేడబోయిన శ్రావణ్‌కుమార్, వార్డు ఆఫీసర్ సురేష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

కనగల్, మే 5 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. కనగల్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కనగల్ బస్టాండ్‌ను పునర్నిర్మించాలని, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. పొనుగోడులో నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కనగల్‌లో 15వ తేదీన నిర్వహించే సీపీఐ మండల మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, నాయకులు దోటి పాండారి, జోగుసురేందర్, బోగరి రాంకోటి, కట్ట యాదయ్య, జోగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

నార్కట్‌పల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మండలంలో పార్టీని బలోపేతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి అన్నారు. బీజేపీ నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడిగా నియామకమైన మేడబోయిన శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌కుమార్‌లను సోమవారం నార్కట్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. మండలంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కొర్వి శంకర్, నాయకులు మునుకుంట్ల గణేష్, వడ్డేగోని రామలింగం, నోముల నాగరాజు, పంజాల శేఖర్, సతీష్, పరమేష్, పాలకూరి రమేష్, శివ, ప్రవీణ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

దైవభక్తిని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం



కట్టంగూరులో గంగదేవమ్మ జాతరలో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే

కట్టంగూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకొని గ్రామాలను ప్రశాంతంగా ఉంచాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గంగదేవమ్మ జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి నర్సింహ, మాద యాదగిరి, మిట్టపల్లి శివ, సత్తయ్య, శ్రీశైలం, యాదయ్య, అశోక్, లింగస్వామి, మధు, అంజనేయులు, యాదగిరి, శంకర్, ఎల్లయ్య, అశోక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రత్యేక పూజలు

కట్టంగూరులో నిర్వహించిన గంగదేవమ్మ జాతరలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగదేవమ్మ జాతరలో యాదవ కులస్థులు సోమవారం తెల్లవారుజామున గంపలు, బోనాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తరాల బలరాం, పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, జనార్ధన్, వెంకటేశ్వర్లు, యాదయ్య, శ్రీను, మల్లేష్, నగేష్, అంజయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఊకొండి గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు

మునుగోడు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధ వయస్సులో తమకు అండగా ఉండాల్సిన కుమారులు రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందారు. ఆ నిరుపేద కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వారికి తనవంతు బాధ్యతగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్ఫూర్తితో మృతుల కుటుంబాలకు రూ.40వేల ఆర్థికసాయాన్ని డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అందజేసి మానవత్వం చాటుకున్నారు. మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన మర్రి మురళి, బింగి మత్స్యగిరి అనే ఇద్దరు యువకులు పది రోజుల క్రితం రోడ్డు మృతి చెందారు. సోమవారం వారి కుటుంబసభ్యులకు తనవంతుగా చెరో రూ.20వేల చొప్పున మొత్తం రూ.40 వేల ఆర్థికసాయాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి పంపారు. వారికి గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నడ్డిపెల్లి యాదగిరి, మాజీ ఎంపీపీ మేడి నాగలక్ష్మి యాదయ్య, మాజీ సర్పంచ్ నిమ్మల స్వామి, నాయకులు బీమగోని స్వామి, మాదగోని రుషికేష్, మాదగోని దేవలోకం, వెంకన్న, శంకర్, సత్తయ్య పాల్గొన్నారు.

మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తుస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, సీపీఎం నాయకులు

చిట్యాలరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రభుత్వ భూములు, గుట్టల ప్రాంతం నుంచి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు మల్లం మహేష్, దేశబోయిన నర్సింహ, అరూరి శంభయ్య కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వారు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫాబెక్స్ పరిశ్రమ మట్టిని తరలిస్తుందని ఆరోపించారు. దానికి అనుమతులు లేవని ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుందని తెలిపారు. మట్టి తరలింపునకు అనుమతులున్నాయా? ఉంటే ఏ మేరకు మట్టిని తరలించాలో రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి తరలించే మట్టి వివరాలను తెప్పించుకుని పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

'ప్రజావాణి' కార్యక్రమానికి వినతుల వెల్లువ



ప్రజలనుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నాం... ఆదుకోండి అంటూ జిల్లా నలుమూలల నుంచి అనేక మంది బాధితులు వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రాలు అందజేస్తున్నారు. వీరిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై ప్రజావాణికి రాగా మరికొందరు సామాజిక అంశాలపై తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించి అందులో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో రిజర్వేషన్ పాటించాలి

నేను దివ్యాంగురాలిని. నేను గతంలో జరిగి గ్రామసభలలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. అన్ని అర్హతలు ఉన్న నాకు మొదటి లిస్టులో పేరు వచ్చింది. అయితే ఇటీవల గ్రామంలో 50 మందితో కూడిన ఇందిరమ్మ ఇళ్ల లిస్టు విడుదల చేశారు. అందులో మాత్రం నా పేరు లేదు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే సమాధానం లేదు. కనీసం తన పేరును దివ్యాంగురాలి కోటాలోనైనా కేటాయించలేదు. ఇప్పటికైనా తన పేరును దివ్యాంగుల కోటాలోనైనా చేర్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

- జి. రజిని, అమ్మనబోలు, నార్కట్‌పల్లి మండలం

అడ్మిషన్ బదిలీ చేయాలి



నా కుమారుడికి బెస్ట్ అవెలబుల్ పథకంత కింద పట్టణంలోని సెయింట్ ఆంథోనిస్ స్కూల్ లో ఒకటవ తరగతిలో సీటు లభించింది. అయితే రెండేళ్ల విద్యనభ్యసించాక అనారోగ్య కారణాలతో సీటును మరో పాఠశాలకు బదిలీ చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు దరఖాస్తు చేశారు. అప్పట్లో వేరే స్కూల్‌కు బదిలీ చేశారు. కానీ ఇప్పటి వరకు అడ్మిషన్ బదిలీ ఆర్డర్ ఇవ్వలేదు. దీంతో నా కుమారుడికి రావాల్సిన బెనిఫిట్స్ రావడం లేదు. కావున అధికారులు బదిలీ ఆర్డర్ ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలి.

- బొజ్జ నాగరాజు, పెద్దబండ, నల్లగొండ.



మహనీయుల ఆశ సాధనసమితి సభ్యులు

గదిని కేటాయించాలి

అంబేడ్కర్ యువజన సంఘం, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మహనీయుల ఆశయసాధన సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఎస్సీ కమ్యూనిటీ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. అందులో కులాంతర వివాహాలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సందర్భాల్లో బాధితులకు న్యాయం చేయడం, విద్య, ఆరోగ్య విషయాల్లోనే కాకుండా ఎస్సీ కుటుంబాలలో చనిపోయిన వారి అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం చేస్తున్నాం. అయితే తమకు కార్యాలయం లేక బాధితులు తమను కలిసేందుకు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సాంస్కృతిక ఆడిటోరియంలో తమ సంఘానికి ఒక గదిని కేటాయించి తమ సేవా కార్యక్రమాలకు సహకరించాలి.

- మహనీయుల ఆశయ సాధనసమితి సభ్యులు, నల్లగొండ


రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి



నేను నా భార్య దివ్యాంగులం. మాకు ఇద్దరు సంతానం. మాకు గ్రామంలో ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నాం. అయితే గ్రామసభలో మా పేరు వచ్చిన తర్వాత వచ్చిన లబ్దిదారుల జాబితాలో మాకు ఇల్లు రాలేదు. మాకు గ్రామంలో రేషన్ కార్డు కూడా లేదు. నేను అందుడిని అయినందున ఇంటి వద్దనే ఉంటాను. నా భార్య కూలి పనికి పోయి కుటుంబాన్ని పోషిస్తుంది. దయచేసి తమకు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించండి.

- మారపాకుల నిరంజన్, ముదిగొండ, దేవరకొండ మండలం

తప్పుడు సర్వే చేశారు



మాకు గ్రామంలో సర్వే నెంబర్ 302లో పట్టా భూములు ఉన్నాయి. ఆ భూములకు వెళ్లేందుకు ప్రభుత్వ నక్ష ప్రకారం డొంకదారులు ఉన్నాయి. అయితే ఈ భూములను కొందరు ఆక్రమించుకోవడంతో మేము మా భూముల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో బాట సర్వే కోసం చలానా కట్టాం. అయితే సర్వేయర్ తప్పుడు సర్వే నిర్వహించి అవతలి వ్యక్తులకు అనుకూలంగా నివేదిక ఇచ్చాడు. దీంతో అక్రమణదారులు మమ్ముల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దయచేసి ఏడీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలి.

- పెద్ది రామచంద్రం, కురంపల్లి, చింతపల్లి మండలం

అవకతవకలపై విచారణ జరిపించాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ మంజూరులో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా 4 వార్డు కేశరాజుపల్లిలో అర్హులకు జాబితాలో చోటు లభించకపోగా అనర్హులకు ఇళ్లను మంజూరు చేశారు. ముఖ్యంగా ఎకరాల కొద్ది భూమి ఉన్న వారిని కూడా అర్హులుగా గుర్తించారు. స్థానిక మాజీ కౌన్సిలర్ తనకు అనుకూలంగా ఉన్న వారికే ఇళ్లను ఇప్పించారు. ఫలితంగా అర్హులైన వారికి ఇళ్లు రాలేదు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలి.

- బొజ్జ రాబర్ట్, కేశరాజుపల్లి, నల్లగొండ

రైతులంతా ఫార్మర్ ఐడీ పొందాలి



రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న కేతేపల్లి ఏవో పురుషోత్తం

కేతేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు గుర్తింపు సంఖ్య కోసం తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. మండలకేంద్రం కేతేపల్లిలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ అవగాహన కార్యక్రమంలో ఆమన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు పొందడానికి రైతుల విధిగా ఫార్మర్ ఐడీ పొంది ఉండాలన్నారు. ఇందుకోసం ఈ ఏడాది జనవరి 1 నాటికి డిజిటల్ సైన్‌తో పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌లకు అనుసంధానం అయిన ఫోన్ నెంబర్‌తో తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకుని 11 అకెంలతో కూడి న గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. ఏఈవోలు క్లస్టర్లలో రై తులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కె.లతీఫ్, నాయకులు ఆర్.యాదగిరి, ఏఈవోలు బాలరాజు తదితరులు పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి లభించే పీఎం కిసాన్ యోజన తరదితర సబ్సిడీ పథకాలను పొందేందుకు రైతులకు యూనిక్ ఐడీ నెంబర్ ఉపయోగపడుతుందన్నారు.

రైతులకు యూనిక్‌ఐడీ నెంబర్లు జారీ చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. దీంతో వ్యవసాయ భూమి కలిగిన ప్రతిరైతు ఏఈవోలను సంప్రదించి యూనిక్ ఐడీ నెంబర్లను తీసుకోవాలని ఏవో కోరారు.

చట్టాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు



చిట్యాలలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిట్యాల, మే 5(ఆంధ్రజ్యోతి): చట్టాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు అన్నారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన నాకాబందీలో ఆయన పాల్గొన్నారు. పోలీసులు నెంబర్ ప్లేటు లేకుండా నడుస్తున్న 20 వాహనాలను పట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేటు లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపవద్దని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మా, కానిస్టేబుల్స్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి : సీపీఐ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బొల్గూరి నర్సింహ

మునుగోడు, మే 5(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలను కలిశారు. పనిప్రదేశంలో కల్పించిన సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పని చేసే ప్రాంతంలో నీటి సౌకర్యం, టెంట్ వసతి కల్పించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని దినాలను పెంచి అవసరమైన పనిముట్లను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ. జానిమీయా, దుబ్బ వెంకన్న, రేవెల్లి అంజయ్య, సైదమ్మ, భాగ్యమ్మ, పారిజాత, చాపల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

మునుగోడు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సైదులు అన్నారు. మునుగోడుకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎఆర్‌ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు సోమవారం ఆయన అందజేసి మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆరెళ్ల సైదులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు మిర్యాల వెంకన్న, పందుల నర్సింహ, జిట్టగోని యాదయ్య, నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

సా..గుతున్న రోడ్డు విస్తరణ పనులు

» సరైన రోడ్డు లేక ప్రజల అవస్థలు

» హామీలకే పరిమితమైన కాశీవారిగూడెం రోడ్డు



గంగన్నపాలెం నుండి రాజుపేటకు వెళ్ళే మట్టి రోడ్డు

తిప్పర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన పనులు సాగుతున్నాయి. ఏళ్ల గడస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏదైనా పనులు ప్రారంభిస్తే 6 నెలలు ఏడాది కాలంలో పూర్తి చేయాలని కానీ తిప్పర్తి మండలంలో మాత్రం శిలాఫలకాలతోనే సరిపెడుతున్నారు. మండల పరిధిలోని కాశీవారిగూడెం నుంచి రాజుపేట వరకు, గంగన్నపాలెం నుంచి ఎర్రగంట్ల గూడెం మీదుగా రాజుపేట వరకు, అద్దంకి - నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డు నుండి కాశీవారిగూడెం గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తి అయింది. ఈ మార్గంలో మొత్తంగా సుమారు 8 కిలోమీటర్ల రోడ్డును విస్తరణ చేయాల్సి ఉంది. కానీ పనులు రెండేళ్లయినా పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అదనపు దూరం

గంగన్నపాలెం గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఈ రోడ్డు సమస్య వల్ల తిప్పర్తి మండల కేంద్రానికి చేరుకొని నల్లగొండకు వెళ్లాల్సి రావడంతో సుమారు 8 కిలోమీటర్లుల అదనంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా రాజుపేట గ్రామ పంచాయతీలోని యర్రగంట్ల గూడెం గ్రామస్థులు జిల్లా కేంద్రానికి చేరుకోవాలన్నా, ఇటు మండల కేంద్రానికి చేరుకోవాలన్నా 2 గంటల సమయం పడుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. మట్టి రోడ్డు అయినా సరిగ్గా లేకపోవడంతో 3 కిలోమీటర్ల రోడ్డులో గంటకు పైగా ప్రయాణం చేయాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే మాత్రం అదే రోడ్డుపై 2గంటలపైగా సమయం పడుతుందని, ఆ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి మా గ్రామాలకు రోడ్డు మార్గాలను ఏర్పాటు చేసి ఆయా గ్రామాలను కలుపుతూ వెళ్లేలా ఆర్‌టీసీ బస్సులను కూడా నడిపించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర సమయాల్లో ఇక్కట్లు

ఈ గ్రామాల ప్రజలకు సరైన రోడ్డు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్య కోసం కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఆయా గ్రామాలలోని విద్యార్థులు పాఠశాలలకు, పలు రకాల పనుల నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ప్రజలు ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. 2023 మే నెలలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా గంగన్నపాలెం నుంచి రాజుపేట, చిన్నాయిగూడెం నుండి కాశీవారిగూడెం మీదుగా రాజుపేట వరకు రూ. 5.18 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు ప్రారంభిస్తూ శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి కానీ నేటికి రోడ్డు పనులు ప్రారంభం కాలేదు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



మా గ్రామానికి రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలన్నా, జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా 2 గంటల సమయం పడుతుంది. వర్షాకాలంలో ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించి గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా కల్పించాలి.

-వెంకట్‌రెడ్డి యర్రగంట్లగూడెం గ్రామస్థుడు


భూమి, నిధుల సమస్యతో ఆలస్యం

తిప్పర్తి మండల పరిధిలోని కాశీవారిగూడెం నుంచి రాజుపేట వరకు 2023లో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. పనులు రోడ్డు వేసే క్రమంలో భూ సమస్యతో కొంత ఆలస్యం జరిగింది. కాంట్రాక్టర్ వద్ద నిధుల కొరతతో మరి కొంతకాలం ఆలస్యమైంది. ప్రస్తుతం పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖకు రోడ్డుకు సంబంధించిన ఫైల్ బదిలీ చేయబడింది. అప్రూవల్ కాపీ కోసం వేచి చూస్తున్నాం.

- పల్లి శ్రీనివాస్, ఏఈఈ



ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.170	250	280
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 24.2

కొనుగోలుకు కొర్రీలు

» నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ఆంధ్రజ్యోతి విజిట్



ధాన్యం కొనుగోలు కేంద్రాల లక్ష్యం నీరుగారుతోంది. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యంతో ఎండవేడిమికి తాగునీరు, టెంట్ సౌకర్యం లేక హమాలీలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలు, గన్నీబ్యాగుల కొరతతో ఎగుమతి, దిగుమతులు ఆలస్యమవుతున్నాయి. దీంతో రోజుల తరబడి కేంద్రాల వద్దే రైతులు పడిగాపులు పడుతున్నారు. దీనికి తోడు కాంటా వేసేందుకు హమాలీలకు, ఇతర చార్జీలు, తాలూ పేరుతో రైతులు నిలువునా దోపిడీకి గురవుతున్నారు. కొన్నిచోట్ల ఎగుమతి, దిగుమతి బాధ్యతలనూ రైతులపైనే వేస్తున్నారు. వెరసి కేంద్రాల్లో కర్షకులు దోపిడీకి గురవుతున్నారు.

• 6లో..

నాంపల్లి నుంచి కొండమల్లేపల్లికి వచ్చిన



కొండమల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని తెలిసి నాంపల్లి మండలం నుంచి 20 రోజుల కిందట ధాన్యం తీసుకొచ్చా. తేమ వచ్చి 6 రోజులు గడుస్తోంది. లారీల కొరత సాకుతో కొనుగోళ్లు చేయలేదు. ఎప్పుడు వర్షం వస్తుందోనని భయంతో టార్పాలిన్లు అద్దెకు తెచ్చి పంటను కాపాడుకుంటున్నా. డబ్బులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం.

జక్కుల వెంకటయ్య, ముష్టిపల్లి

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలైన ప్రక్రియ (ఆంధ్రజ్యోతి, నల్లగొండ) • 7లో..

భూ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)పై ఉమ్మడి జిల్లాలో ఆశించిన ఫలితం దక్కడంలేదు. 2020లో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పొడిగిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులోగా నిలిపివేయాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం 25శాతం రాయితీ కూడా ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఆశించిన రీతిలో దరఖాస్తులు పరిష్కారమవకపోవడంతో అనుకున్నమేర ఆదాయం రాలేదు. తాజాగా మరోసారి జూన్ 3వ తేదీ వరకు దరఖాస్తుల నమోదు, పరిష్కారానికి గడువుపెంచింది. ఈసారైనా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తుంటే, ఈ దఫాలోనైనా సర్వర్ల సమస్యలు, క్షేత్ర పరిశీలన పేరుతో దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)



ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం అంతంతే!

» ఉమ్మడి జిల్లాలో రూ.107.57కోట్లు వసూలు » భారీగా వచ్చిన దరఖాస్తులు » పరిష్కారమవుతున్నవి స్వల్పమే » అధికారులకు దృష్టిపెట్టడంలేదనే విమర్శలు » జూన్ 3 వరకు మరోసారి గడువు పెంచిన ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీలకు నందికొండ (నాగార్జునసాగర్) మునిసిపాలిటీలో ప్రభుత్వ స్థలాలేవీ లేవు. ఉన్న స్థలాలన్నీ ఎన్నెస్పీ, అటవీశాఖకు చెందినవే కావడంతో ఇక్కడ ఎల్‌ఆర్‌ఎస్‌కు మునిసిపల్‌శాఖ నోటిఫికేషన్ జారీచేయలేదు. మిగిలిన 18 మునిసిపాలిటీల్లో ఇప్పటివరకు 1,95,173 దరఖాస్తులు రాగా, 39,260 పరిష్కారమవడంతో రూ.107.57కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇంకా సుమారు 38వేల పైచిలుకు దరఖాస్తులు ఆమోదం పొందినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తికాలేదు. మిగిలిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రత్యేక వెబ్‌సైట్ అయినా సాంకేతిక సమస్యలు..

భూములను క్రమబద్ధీకరించి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్‌ను రూపొందించింది. యూజర్ మ్యాన్యువల్ ప్రీ రిజిస్ట్రేషన్ ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులేటరీ స్కీం-2020) పేరుతో ఈ వెబ్‌సైట్ ఏర్పాటుచేసింది. అంతేగాక ఆక్రమిత భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకొచ్చే దరఖాస్తుదారులకు వన్‌టైం సెటిల్‌మెంట్ అమలు చేసి నిర్ధారిత ఫీజులో 25శాతం రాయితీ కూడా ప్రకటించింది.అయితే సర్వర్లు బిజీగా ఉండడం, ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగకపోవడం, ఆక్రమిత స్థలాలు, భవనాల యజమానులు ముందుకు రాకపోవడంతో ఈ ప్రక్రియ మందకొడిగా సాగింది. ప్రధానంగా క్షేత్ర పరిశీలన ప్రక్రియ జాప్యమవడం, మొదటి దశలోనే దరఖాస్తు అప్‌లోడ్ కాకుండా ఆటంకాలు ఎదురవుతుండడం వంటి కారణాలతో క్రమబద్ధీకరణలో వేగం తగ్గింది. పైగా దరఖాస్తుదారులకు నేరుగా ఆటోజనరేటెడ్ మెసెజ్‌లు వెళ్లడంతో వారంతా ఒకేసారి మునిసిపల్ కార్యాలయాల వద్ద బారులుతీరారు. దీంతో సర్వర్లు మొరాయించడం వంటి సాంకేతిక సమస్యలు క్రమబద్ధీకరణ ప్రక్రియకు ఆటంకంగా మారింది.

క్షేత్రస్థాయి పరిశీలన పేరుతోనే ఎక్కువ పెండింగ్..

మునిసిపల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలో చేస్తున్న జాప్యం వల్లే ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి వంటి పాత మునిసిపాలిటీల్లో భారీగా దరఖాస్తులు రావడంతో క్షేత్రస్థాయి పరిశీలన ఇబ్బందికరంగా మారిందని, ఉద్యోగులకు సమయాభావంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. దీనికి తోడు నిబంధనలకు...

- మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ఇలా...

మునిసిపాలిటీ	వచ్చిన దరఖాస్తులు	పరిష్కారమైనవి	ఆదాయం (రూ.కోట్లలో)
నల్లగొండ	36,140	3388	20.87
సూర్యాపేట	35,633	6587	20.95
భువనగిరి	15,602	4386	11.99
మిర్యాలగూడ	14,336	2652	11.95
దేవరకొండ	5022	3411	0.75
హాలియా	3418	621	1.35
చిట్యాల	3209	480	1.06
నకిరేకల్	7080	605	1.20
చండూరు	3632	513	0.91
కోదాడ	16000	3600	12.00
నేరేడుచర్ల	3157	692	0.57
హుజూర్‌నగర్	4425	826	2.43
తిరుమలగిరి	6036	745	1.26
ఆలేరు	4700	1180	2.34
చౌటుప్పల్	16,571	4087	7.01
యాదగిరిగుట్ట	9000	2800	4.45
మోత్కూరు	3,660	1012	1.95
పోచంపల్లి	7552	1675	4.53
మొత్తం	1,95,173	39,260	107.57

'డయల్ యువర్ సైబర్ నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



గ్రీవెన్‌డేలో ఫిర్యాదులు తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): 'డయల్ యువర్ సైబర్ నేస్తం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 35 మంది ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకొని సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా కఠినంగా వ్యవహరించాలన్నారు. 'డయల్ యువర్ సైబర్ నేస్తం' కార్యకమంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు సలహాలు ఇవ్వడంతోపాటు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 11 నుంచి 2గంటల వరకు సైబర్ బాధితుల కోసం 'డయల్ యువర్ సైబర్ నేస్తం' నిర్వహిస్తామని బాధితులు సెల్ నంబర్ 8712658079కు కాల్ చేయాలని తెలిపారు.

కుటుంబ సర్వే రెమ్యునరేషన్‌ను చెల్లించాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబరు 6 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి నేటికీ రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ సర్వేను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిన సిబ్బందికి కొన్ని జిల్లాల్లో చెల్లింపులు చేసినా జిల్లాలో మాత్రం నేటికీ రెమ్యునరేషన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి మాట్లాడుతూ, గత మార్చి 18న కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. వారం రోజుల్లో రెమ్యునరేషన్ చెల్లించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేయగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, నాయకులు నర్రా శేఖర్‌రెడ్డి, వడిత్య రాజు, ఎడ్ల సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, ఎ.చిన్న వెంకన్న, కొమ్మరాజు సైదులు, మధుసూదన్, రకేష్, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను ఎంపికచేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా కేటాయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో అనర్హులు లేకుండా మండల ప్రత్యేక అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబితాలో అనర్హులు ఉంటే పూర్తి బాధ్యత మండల ప్రత్యేక అధికారులదేనన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గతంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయం పొందిన వారికి తిరిగి రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు అర్హత ఉండదని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాస పథకం లక్ష్యాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వారాంతానికి నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన ధర్తీ ఆబా యోజనకు ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పంపించాలని ఆదేశించారు. ఈ నెల 12న మిస్ వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్‌ని బుద్ధవనాన్ని సందర్శిస్తున్న దృష్ట్యా బుద్ధవనం, విజయవిహార్ వద్ద శానిటేషన్, లైటింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు వ్యక్తిగతంగా ఆహ్వానం పలకాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించి ఎండలో పని చేసే వారికి సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. పనిచేసే చోట నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నీట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులను కలెక్టర్ అభినందించారు. కాగా 'ప్రజావాణి'లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు వారి దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేశారు. కొన్నింటిని కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవోలు వై.అశోక్‌రెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత ఆలోచన విరమించుకోవాలి

రామగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యా కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలలను మూసివేయాలనే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య డిమాండ్ చేశాడు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలను శాస్త్రీయంగా పరిశీలించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులివ్వడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఒక కారణమేనని అన్నారు. గ్రామాల నుంచి బస్సుల ద్వారా విద్యార్థులను తరలిస్తున్నప్పుడు పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నందున మూసివేయాలనే ఆలోచన చేయడం ప్రజలందరికీ విద్యను దూరం చేయడమేనని అన్నారు. వేసవిలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు పి.ఏడుకొండలు, టి.వెంకటేశ్వర్లు, ఇ.జగతి, ఇ.అంజయ్య, ఎండి.ఖుర్షిద్ మియా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి

నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ఇళ్లుగా మారుస్తున్న అధికారులపై, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో అయన మాట్లాడారు.

అత్యం త ప్రజాస్వామికంగా, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనలన్నీ అబద్ధాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకులు చెప్పేవారికే కేటాయిస్తున్నారని, దీనిపై విచారణ జరిపించాలన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని లేదంటే పేదలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, ఉయ్యాల లింగస్వామి గౌడ్, నాగిళ్ల యాదయ్య, బర్రె సంజీవ, ఆవుల నరసింహయాదవ్, మాదగోని పద్మ, గుణగంటి అండాలు, ఉయ్యాల ధనమ్మ, ఆవుల సునీత, పంగ్గరెక్క కృష్ణయ్య, పంగరెక్క లలిత, గుణగంటి సైదులుగౌడ్, మాదగోని లింగస్వామిగౌడ్, కొత్త మల్లేష్‌గౌడ్, కొత్త ఈశ్వరమ్మ, గుణగంటి వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలోపీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పైప్‌లైన్ పనులు నిలిపివేయాలి

త్రిపురారం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి రెడ్డీస్ పరిశ్రమకు నీటి తరలింపునకు ఏర్పాటుచేస్తున్న పైప్‌లైన్ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ అంతరభాగంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టిపోసి బండ్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి పైప్‌లైన్ల ఏర్పాటు పనులు జరుగుతుండగా గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి కొరత ఉండగా పరిశ్రమకు నీటిని తరలించడం ఏంటని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు సక్రమంగా లేక నీటి సరఫరా జరగడం లేదని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు పైప్‌లైన్ పనులను నిలిపివేయాలన్నారు. పనులు అడ్డగించిన వారిలో గ్రామస్థులు గుండెబోయిన వెంకటేశ్వర్లు, కొప్పు సోమయ్య, దైదా రవి, అల్లం నాగరాజు, మట్టపల్లి, సైదులు, సురేష్, తదితరులు ఉన్నారు.

పనులను అడ్డుకున్న పెద్దదేవులపల్లి గ్రామస్థులు



చెరువు వద్ద పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

వికసించిన మే పుష్పం

రామగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో రిటైర్డ్ ఎస్‌ఐ లింగయ్య ఇంట్లో మే పుష్పం వికసించింది. కొన్నేళ్ల క్రితం ఈ మొక్కను అతడు నాటగా, ఈ పుష్పం 15రోజుల పాటు వికసించే ఉంటుందని ఆయన తెలిపారు.



ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు :
మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394
Miryalguda ACO- 9963624250, Miryalguda SR - 9542690885,
Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544,

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

దేవరకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన ఉంటుందని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

'అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి'

నిడమనూరు, మే 5(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్ కేశ శంకర్, మండల కోఆప్షన్ సభ్యుడు సలీం డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వారు ఎంపీడీవో బోనగిరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లు లేని వారికి కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేసినట్లు జాబితాలో పేర్లు ఉన్నాయని ఆరోపించారు. విచారణ చేసి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం

● ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్‌ను 10వ వార్డు నందిపాడ్‌లో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలిప్రధాని నెహ్రూ కాలం నుంచి ఇందిరాగాంధీ తదితర కాంగ్రెస్ ప్రధానులు పేదల అభ్యున్నతి కి పనిచేస్తూ వచ్చారన్నారు. రాష్ట్రంలో పదేళ్ల పాలనలో ఆర్థికంగా అగమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కృషి చేస్తోందన్నారు. పేదలకు కూడు, గూడు కల్పించే దిశగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సబ్సిడీ ద్వారా రూ.500 కే వంటగ్యాస్‌ను అందిస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. పార్టీ అభివృద్ధికి పాటుపడిన సామాన్య కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ రైతులు పండించిన వరి దాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటోందని అన్నారు. ప్రజాపాలనలో అన్ని శాఖల అభివృద్ధికి ముందడుగు పడిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాగునాయక్, జొన్నలగడ్డ, మోహన్‌రెడ్డి, పగడాల నాగిరెడ్డి, అశోక్, భీమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

'సిబిల్‌తో రాజీవ్ యువ వికాసానికి లింక్ పెట్టొద్దు'

మిర్యాలగూడ, మే 5(ఆంధ్రజ్యోతి): సిబిల్ స్కోర్‌కు రాజీవ్ యువవికాస పథకానికి ముడిపెట్టడం సమంజసం కాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మిర్యాలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.100ల కోట్లు ఎగవేతకు పాల్పడుతున్న కార్పొరేట్లు, కాంట్రాక్టర్లకు బ్యాంకులు, ప్రభుత్వాలు ఎర్రతివాచీ పరుస్తుండగా ఉపాధి లేని నిరుద్యోగులకు ఆంక్షలు ఎందుకు అని ప్రశ్నించారు. బ్యాంకుల్లో లావాదేవీలు లేని బడుగు, బలహీనవర్గాల యువత రాజీవ్ యువవికాస పథకానికి దరఖాస్తు చేసుకున్నారని సిబిల్‌తో సంబంధం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో తీసుకున్న రుణాలతో ముడిపెట్టకుండా అందరికీ రుణ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



జాజుల లింగంగౌడ్

'ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న పుట్టల దినేష్

మిర్యాలగూడ టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం సరికాదని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల దినేష్ అన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల హడావుడి, ప్రచారంతో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, సర్వే సిబ్బంది రా.కీయ ఒత్తిళ్లకు లోబడకుండా నివేదిక సమర్పించాలన్నారు. నిరుపేదలు, ఇళ్లు లేని బీదలకు తొలి ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామకమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు నాలి నాగరాజు, ఉపాధ్యక్షుడు గాలీబ్, మడుగు వీరయ్య, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



బంకాపురంలో రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సత్యం

నిడమనూరు, మే 5(ఆంధ్రజ్యోతి): సాగులో ఆధునిక పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని హాలియా ఏడీఏ వెంకటరమేందర్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని బంకాపురం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట సోమవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. యూరియాను తక్కువగా వినియోగిస్తే సాగు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో విత్తనాల గురించి కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎన్.లింగయ్య, పంటల మార్పిడి, అపరాల సాగు గురించి శాస్త్రవేత్త శ్రీధర్ రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏవో మునికృష్ణయ్య, ఏఈవో విజయచంద్ర, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఉన్నం సత్యనారాయణ, వీరభద్రరావు, పెదవెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కృషి : సీఐ



సీఐ రాజును సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ పద్మపుల్‌సింగ్‌నాయక్

చింతపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు నాంపల్లి సీఐ రాజు తెలిపారు. మండలంలోని రోటిగడ్డ తండాలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దొంగతనాల నిర్మూలనకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ఎల్లప్పుడూ పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో చింతపల్లి ఎస్ఐ యాదయ్య, మాజీ సర్పంచ్ ఇస్లావత్ పద్మ పుల్‌సింగ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండ్లపల్లి నరసింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ కాసారపు మల్లయ్య, హరిప్రసాద్, కైలాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పలు.. కుప్పలుగా చెత్త

- డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న బంగారుగడ్డ
- చోద్యం చూస్తున్న అధికారులు
- అవస్థలు పడుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడలో ఏర్పాటు చేసిన డం పింగ్ యార్డ్ వ్యర్థాలతో నిండుకుందనో.. మరెందుకో గానీ బంగారుగడ్డ మినీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. మునిసిపల్ పారిశుధ్య విభాగం. సీతారాంపు రం, బంగారుగడ్డను విడదీసే ప్రధాన నాలా బ్రిడ్జి వెంట చెత్తకుప్పలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. పండ్ల, కూరగాయల వేస్టేజీతో పాటు చికెన్ వ్యర్థాలు, తాగేసిన కొబ్బరి బొండాలు ఏపుగా పడేస్తున్నప్పటికీ మునిసిపల్ శానిటరీ విభాగం చోద్యం చూస్తోంది. ఇరు కాలనీలను కలిపేందుకు వేసిన బ్రిడ్జి నుంచి వెళ్లే రహదారంతా చెట్ల కొమ్మలు, గాజుపెంకలతో నిండుకుందని స్థానికులు వాపోతున్నారు. ఇక ఆస్పత్రుల నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాలు సైతం ఇక్కడే గుట్టలుగా దర్శనమిస్తున్నాయి.



బంగారుగడ్డ మోరీ వద్ద చెత్తకుప్పలు

స్థానికుల్లో ఆందోళన

డంపింగ్ యార్డుకు వెళ్లాల్సిన వ్యర్థాలు తమ పరిసరాలలో కనిపిస్తుండటంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తపరుస్తున్నారు. చెత్తకుప్పలు నిల్వ ఉన్న కారణంగా వాతావరణం కలుషితమవుతోందంటున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు, పందుల బెడద పెరిగిందని, దుమ్ము, దుర్వాసనతో అనారోగ్య సమస్యలు తలెత్తుతూ జీవనశైలిపై ప్రభావం చూపుతుంది. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు

మొరపెట్టుకున్నా ఫలితం లేదు



మా కాలనీలో చెత్తకుప్పలు గుట్టలుగా మారిపోగా, వ్యర్థాలతో నిండిన ఈ ప్రాంతం మినీ డం"పింగ్ యార్డులాగా మారింది. వ్యర్థాల వల్ల దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. కాలనీలో దోమలు, పందుల బెడద పెరిగింది. ఇదే విషయాన్ని మునిసిపల్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు కాలనీలో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

- కంచరకుంట్ల దయాకర్‌రెడ్డి, (స్థానికుడు)

అవసరమైన చర్యలు తీసుకుంటాం



మాశానిటరీ విభాగం సమర్థవంతంగా పనిచేస్తోంది. బంగారుగడ్డలో పర్యటించి అవసరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దు. తడి, పొడి చెత్తను విడివిడిగా మాసిబ్బం దికి అందజేయాలి.పండ్లు, కూరగాయల వ్యాపారులు చెత్తను పారిశుధ్య సిబ్బందికి అప్పగించాలి.

- మహ్మద్ యూసుఫ్,మునిసిపల్ కమిషనర్,మిర్యాలగూడ

ఎల్లాపురంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తిరుమలగిరి(సాగర్), మే 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడం, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఎల్లాపురం గ్రామస్తులు కొద్ది రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎల్లాపురంలో 'తాగునీటి కోసం తండ్లాట' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో దాన్ని బిగించి త్రీ ఫేస్ విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే సోమవారం మిషన్ భగీరథ ఇంట్రా ఏఈఈ ప్రదీప్‌రెడ్డి, గ్రిడ్ ఏఈఈ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సునీతతో కలిసి గ్రామంలో తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భగీరథ ట్యాంక్‌లో సరిపడా శుద్ధి చేసిన తాగునీటిని నింపడంతోపాటు సమయానుకూలంగా భగీరథ నీటిని, బోర్ వాటర్‌ను నల్లాల ద్వారా విడివిడిగా సప్లయ్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు సురక్షితమైన తాగునీటిని స్థానికులకు అందించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీకి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.



ఎల్లాపురం గ్రామంలో నీటి సరఫరా గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మిషన్ భగీరథ అధికారులు

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

దేవరకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన ఏఐటీయూసీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం కార్మికుల చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీస వేతన చట్టం అమలుచేయాలని అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, నాయకులు నల్ల వెంకటయ్య, ఏపూరి కృష్ణయ్య, యాదగిరి, నాగరాజు, వెంకట్రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

కబ్జాతో ఆక్రమణదారుల దర్జా

● నర్లకుంట చెరువును సాగు భూమిగా మార్చినా పట్టించుకోని అధికారులు ● పంట భూములు బీళ్లుగా మారుతున్నాయని రైతులు ఆవేదన

త్రిపురారం ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఊరందరికి ఊపిరి పోసిన చెరువు అది. ఒకప్పుడు మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపింది ఆ చెరువు. అలాంటి నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెంలో ఉన్న నర్లకుంట చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. ఈ చెరువు 58ఎకరాల్లో ఉండగా 38ఎకరాలు కబ్జాకు గురైంది. ఈ ప్రాంతంలో ఎకరా భూమి విలువ రూ.25లక్షలు ఉంది. ఈ లెక్కన రూ.9.50కోట్ల విలువైన చెరువు భూమి కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. ఈ చెరువు కింద సుమారు 500 ఎకరాలు ఆయకట్టు ఉంది. చెరువు ఆక్రమణకు గురైనందున సాగు నీటి లభ్యత కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావులు ఏర్పాటు చేసుకున్నా భూగర్భజలాలు అడుగంటి, పంట భూములు బీళ్లుగా మారాయని రైతులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి మత్స్యకారులు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చెరువు అన్యాక్రాంతం కావడంతో వారి బతుకులు భారంగా మారాయి.

● గత ఏడాది ఏప్రిల్‌లో చెరువు మధ్యలో ఎక్స్‌వేటర్‌తో మట్టి తీసి ట్రాక్టర్లతో చదును చేస్తుండగా మత్స్యకారులు అడ్డుకుని, అదే రోజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.. అప్పటి కలెక్టర్‌గా ఉన్న దాసరి హరిచందన చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించినా నేటికీ పురోగతి లేదు..

కలెక్టర్ ఆదేశాలతో చెరువు ఆక్రమణపై రెవెన్యూ, ఎన్ఎస్పీ అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణదారులపై ఎన్ఎస్పీ అధికారులు మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా ఆక్రమణదారుల వాహనాలు వదిలివేశారు. చెరువులో పోసిన మట్టిని ఆక్రమణదారులు చదును చేయించి, ఖరీఫ్, యాసంగిలో వరిని సాగు చేశారు. అయినా ఓ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. మత్స్యకారులు పలుమార్లు సార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఫలితం లేకుండా పోయింది.కబ్జాదారుల ఆగడాలకు అడ్డేలేకుండా పోయింది.

ఏడాది కాలంగా కాలయాపన

చెరువు హద్దులు ఏర్పాటు చేయడంలో ఎన్ఎస్పీ అధికారులు ఏడాది కాలంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెల రోజుల్లో చెరువుకు హద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అతీగతీ లేకుండా పోయిందని మత్స్యకారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువును పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మట్టిని పోయించి ట్రాక్టర్ చదును చేయిస్తున్న ఆక్రమణదారులు (ఫైల్)

ఉపాధి కోల్పోయాం



ఈ చెరువుపై ఆధార పడి జీవించే వాళ్లం. చెరువు చుట్టూ ఉన్న రైతులు ఆక్రమించారు. చెరువులో ముప్పాతిక భాగంలో మట్టి పోసి చదును చేసి పంటలు పండించుకుంటున్నారు. సంఘం తరఫున కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులకు ఎన్నో సార్లు కలిసి సమస్యను వివరించాం. ఇప్పటివరకు ఆక్రమణలను తొలగించలేదు. అధికారులు స్పందించి చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలి.

● అంబటి సైదులు, మత్స్యకారుల సంఘం కార్యదర్శి, పెద్దదేవులపల్లి

తహసీల్దార్‌కు లేఖ రాశాం

నర్లకుంట చెరువును సర్వే చేయాలని వారం రోజుల క్రితం తహసీల్దార్‌కు లేఖ రాశాం. చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసి ఆక్రమణలను తొలగించి హద్దులు ఏర్పాటు చేయిస్తాం..

● కేశవ్, డీఈ, ఎన్ఎస్పీ

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

పెద్దవూర, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో సోమవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తమ్మడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణసమేత అభయాంజనేయస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పురోహితులు శిరసనగండ్ల రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. గ్రామస్థులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కర్న గురువారెడ్డి, వైస్‌చైర్మన్లు వర్ర సైదిరెడ్డి, కూన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, కర్న దామోదర్‌రెడ్డి, గుంటుక సైదిరెడ్డి, కూన్‌రెడ్డి దామోదర్‌రెడ్డి, అలుగుల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కులగణనపై కేంద్ర నిర్ణయం హర్షణీయం

దేవరకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు బెజవాడ శేఖర్, కర్నాటి సురేష్ అన్నారు. సోమవారం దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, అంకూరి నర్సింహ, జల్దా భాస్కర్, గుండాల అంజయ్యయాదవ్, చండీశ్వర్, రవికుమార్, గంజి హరి, ఫణికుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు బెజవాడ శేఖర్, సుధాకర్

బొడ్రాయి వార్షికోత్సవం వైభవంగా నిర్వహించాలి

కొండమల్లేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో బొడ్రాయి నాబిశిల తృతీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని నిర్వహణ కమిటీ తీర్మానించింది. మండల కేంద్రంలోని సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో పట్టణ ప్రజలు సమావేశం నిర్వహించారు. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే బొడ్రాయి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ నెల 24న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకం, హోమం, 25న బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు నీల లక్ష్మయ్య, కేసాని లింగారెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, కుంభం శ్రీనివాగౌడ్, బుచ్చిరెడ్డి, బూడిద వెంకటయ్య, బొడిగె శంకర్, రావుల సత్యనారాయణ, చందా ధనుంజయ, దాచేపల్లి నరేందర్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, బూడిద మల్లేష్‌యాదవ్, బొడ్డుపల్లి శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

మిర్యాలగూడ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ సలాం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడితో పాటు చదువుకున్న చిన్నప్పటి స్నేహితులు సోమవారంషేక్ సలాం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్, రెడపంగ నిరంజన్, పగిడి కృష్ణమూర్తి, గుండా నాగరాజు, వర్క, యాదగిరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా సాగర్ హైదరాబాద్ హైవే

చింతపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ఎప్పుడు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరనగర్ (మాల్)లో అధిక ఉష్ణోగ్రత 41 నమోదు కావడంతో మధ్యాహ్న సమయంలో సాగర్-హైవే నిర్మానుష్యంగా మారింది.

పట్టణంలో ఉండే ప్రజలు వేసవితాపంతో సాయింత్రం 6 గంటల వరకు బయటికి రావాలంటేనే జంకుతున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న సాగర్ జాతీయ రహదారి